
# ఎండమావులు

వింజరపు భాస్కరాచార్యులు

"ప్రేమ" అనే మాటకు నిర్వచనం సూర్యారావని ఒకనాడు కమల అనుకున్నది. ఆ ప్రేమ పర్యవసానం ఏమిటో ఆనాడు ఆమె ఆలోచించ లేదు. కాని...



పందిట్లో పెళ్లి బాజాలు జోరుగా మ్రోగి పోతున్నాయి. ముత్తయిదువులు, పెళ్లి పెత్తనం వహిస్తున్న పెద్దలు హడావిడిగా అటూ యిటూ పరవళ్లు తొక్కుతున్నారు. వధువు తండ్రి వాసుదేవరావుగారు వయోభారం అనుభవించకపోయినా, ఆఖరికి తమ గారాబు కూతురు కమల పెళ్లికూతురు అయిందన్న ఆనందాన్ని అనుభవిస్తూ, పందిట్లో ఒకమూల వాలు కుర్చీలో పవళించారు. ఆయన పెద్దకొడుకు కృష్ణమూర్తి, కోడలు పార్వతి తరచు విసుక్కొంటున్నా, తమ కది తప్ప దన్నట్లుగానే పెళ్లి భారం నిర్వహిస్తున్నారు.

వరుడు నారాయణరావుగారు మద్రాసులో పెద్ద వ్యాపారస్థుడు. అప్పుడే నలభయ్యో పడిలో అడుగు పెట్టేరు. ఆయనకు మొదటి భార్య వలన ఇద్దరు ఆడపిల్లలు మాత్రం కలిగేరు. ప్రస్తుతం వివాహం వంశానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చే పుత్రునికోసం 'పెద్దల బలవంతం' వలన తప్పింది కాదు.

వధువు కమల యిప్పుడు ముప్ఫయి అయిదేళ్ల ముదిత. ఆమెకు పందిట్లో జరుగుతున్న హడావిడి కాని, వదినగారి ఎత్తిపొడుపులు గాని, అన్నగారి అదలింపులు గాని ఏమీ పట్టినట్లు లేదు. ఆమెలో చైతన్యం నామమాత్రంగా గోచరిస్తోంది. వయస్సులోను సౌందర్యంలోను చాలా ప్రకరణాలు గడిచిపోయినా, ముఖంలో తెచ్చిపెట్టుకున్న యాంత్రికమైన చిరునవ్వు మాత్రం లీలగా కనుపిస్తుంది. కంటికి కనుపించని నిర్వేదం చిరునవ్వుల వెనకనుండి తొంగిచూస్తోంది. ఏది ఏమయినా, కమల పెళ్లికూతు రయింది.

## 2

వాసుదేవరావుగారు కాకినాడ దగ్గర ఒక పూరికి కరణం. పెద్దలు గడించిపెట్టిన పెద్ద ఆస్తులేమీ లేకపోయినా, ఆయనకు తన కరణీకం హయాంలో గడించిన ఆరెకరాల మాగాణి, మామిడితోట, ఇల్లు మాత్రం ఉన్నాయి. ఆయనకు ముగ్గురు మగపిల్లల తర్వాత ఒక్కగా నొక్క కూతురు కమల. అందుచేత రావుగార్కి, భార్య కనకమ్మ గారికి కమల అంటే పంచ ప్రాణాలని వేరే చెప్పనక్కరలేదు. కూతురు కోరుకుంటే కొండమీది కోతినైనా తెచ్చి సంతృప్తిపరచేవారు వాసుదేవరావుగారు. ఇక కనకమ్మగారి సంగతి వేరే చెప్పనక్కరలేదు. కాస్త పనిచేస్తే కందిపోతుందేమోనని ఎంతో నొచ్చుకొనేవారు. అతి గారాభంగా, ఆడింది ఆట, పాడింది పాటగా పదిహేనేళ్ల ప్రాయం వచ్చింది కమలకు. కలువరేకుల్లా విప్పారిన కాటుకకళ్లు, బంగారాన్ని మించే శరీరచ్ఛాయ, వాలుజడ, నూత్న యవ్వన ప్రాదుర్భావపు మిసమిసలతో కమల ఎంతో అందంగా కన్పించేది. నీలపు సిల్కు చోళీమీద, తెల్ల వాయిలు చీర కట్టుకుంటే కమల మూర్తీభవించిన సౌందర్యలక్ష్మి అనిపించేది.

అందచందాలకు, అలవడే గుణాలకు, స్వభావానికి ఎక్కువ దూరం ఉన్నట్లు తోస్తుంది. చదువుకీ, సంస్కారానికీ మధ్య ఉండే దూరానికి ఇదేమీ తక్కువ కాదేమో! లోకంలో అందచందాలుండే

చోట తరచు అహంకారం కూడా కన్పిస్తుంది. కమల విషయంలో ఇది అక్షరాలా నిజం అయింది. దానికి తోడు కనకమ్మగారు కమలకు ముద్దు ముచ్చట్లు కొంచెం అతిగా ఆదరించి తీర్చేవారు. రోజూ అద్దం ముందు గంటల తరబడి నిల్చుని అలంకరించుకోడం, స్కూలు టైముకి బయలు దేరి వెళ్ళటం తప్ప ఆమెకు వేరే వూచికపుల్లెత్తు పనిలేదాయింట్లో. ఆమె కెప్పుడూ తన అందం, అలంకరణ అనేవి తప్ప వేరే చింత ఉండేదికాదు. ఆ యింట్లో ఆడపిల్లల చదువులు క్రొత్తయినా, భార్య పట్టువలన కమలను చదివించక తప్పింది కాదు వాసుదేవరావుగారికి.

కమల హైస్కూలులో అయిదవ ఫారంలోకి వచ్చేటప్పటికే, ఆమె పెద్ద అన్న కృష్ణమూర్తికి పెళ్ళయి, ఇద్దరు బిడ్డల తండ్రి అయాడు. తండ్రికి అసరాగా ఉంటానికి, అతను మెట్రిక్యులేషన్‌తోనే చదువు చాలించవలసి వచ్చింది. రెండో అన్న వెంకట్రావు యూనివర్శిటీలో ఫిజిక్స్ ఆనర్స్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. చిన్ననాడే అతనికీ పెళ్ళి అయింది. మూడో అన్న శ్యామలరావు కాకినాడలో ఇంటర్ సీనియర్ చదువుతున్నాడు. వృద్ధాప్యం సమీపిస్తున్నందువలన వాసుదేవరావుగారు కమలకు పెళ్ళి ప్రయత్నాలు చేయడం ప్రారంభించారు.

## ౩

కృష్ణమూర్తి భార్య కాపురానికి వచ్చేసరికి పదిహేడేళ్ళు. ఆమె కమలతో సమంగా అందకత్తె కాకపోయినా, మొత్తంమీద నాజూకుగా ఉంటుందనే చెప్పవచ్చు. ఆమె పుట్టిల్లు కాకినాడ దగ్గర ఒక చిన్న పల్లెటూరు. హైస్కూలు చదువులు గాని, ఎక్కువ ఫేషన్లు గాని తెలిసే అవకాశం ఆమెకు లేకపోయింది. పై పెచ్చు ఆమెకు పూజా పునస్కారాలపై ఆసక్తి ఎక్కువ. అందుచేత ఆమె కమల దృష్టిలో కొంచెం చులకనగా కన్పించేది. కమల సినిమాకు పిలిచినా, తన హైస్కూలు క్లాస్‌మేట్సుతో కేరింతాలు కొడుతున్నా, పార్వతి కొంచెం విముఖంగా ప్రవర్తించేది. కమల దృష్టిలో ఆమె ఇంచుమించు 'పల్లెటూరి మొద్దు' అనే చెప్పాలి. తరచుగా వదినా ఆడపడుచుల మధ్య వాగ్యుద్ధాలు చెలరేగేవి. అందులో కమలదే పై చేయిగా ఉండేది. పిల్లలు పుట్టాక పార్వతి పడే 'అవస్థలు' చూస్తే కమలకు కొంచెం వేళాకోళంగా ఉండేది.

*　　　*　　　*

ఆరోజు విశాఖపట్నం నుండి కమలను చూడటానికి పెళ్ళివారు వచ్చేరు. అబ్బాయి బి. ఏ. పాసయాడు. ప్రస్తుతం ఉద్యోగాన్వేషణలో నిమగ్నుడై ఉన్నాడు. అతనితో పెళ్ళిచూపులకు అతని అక్క, తల్లి నాయనమ్మ కూడా వచ్చేరు.

భోజనా లయిన తర్వాత పెళ్ళిచూపుల కార్యక్రమం ప్రారంభమయింది. కమలను బాగా అలంకరించి తీసుకొనివచ్చి, చాపమీద ప్రక్కగా కూర్చున్నారు కనకమ్మగారు, పార్వతి. ఇంతలో 'ఇంటర్వ్యూ' ప్రారంభమైంది. ముందు కమల చదువు గురించి అడిగారు. తర్వాత "అమ్మాయి కేమైనా సంగీతం గాని, డాన్సు గాని వచ్చునా ?" అని పృచ్ఛించేరు అబ్బాయి అక్కగారు.

సమాధానంగా ఆత్మాభిమానం ముంచుకొస్తున్నా, కమల కంఠం విప్పి పాడటం తప్పలేదు.

"కొంచెం గొంతు బొంగురుగా ఉంద"ని తీర్పు యిచ్చారు అబ్బాయి నాయనమ్మ.

"అమ్మాయి తరుచు సినిమాలు చూస్తుందా ? అని అపరాధ పరిశోధకుని ఫోజులో అడిగేరు అబ్బాయి తల్లి.

తనను సినిమాలు చూడకుండా నిర్బంధించటానికి, అడగటానికి వీళ్ళెవరని కమలకు ఉక్రోషం ముంచుకొని వచ్చింది.

"అప్పుడప్పుడు మాత్రం చూస్తుందండి" అని కనకమ్మగారు నిర్లిప్తంగా జవాబిచ్చేరు. పరీక్షలో తప్పినట్లు పెదవి విరిచింది అబ్బాయి తల్లి

ఒక స్కూలులో పంతులమ్మ పిల్లలందరికీ వాళ్ళ గ్రూపు ఫోటో తలొక కాపీ కొనుక్కోమని చెపుతుంది. "మీరు పెద్దవాళ్ళయ్యాక, యీ ఫోటో చూస్తే మీ కెంతో సంతోషంగా ఉంటుంది. ఒకసారి ఆలోచించండి మీ రేమనుకుంటారో-ఇదిగో సుసీ - దీనికి ఇద్దరు కూతుళ్ళు. ఇది సుభ దీనికి పెళ్ళయింది-వీడు మధు-ఇంజనీరు.

అంతలో వెనక బెంచీ నుంచి ఒక గొంతుక:—ఈమె మన పంతులమ్మ-పాపం! చచ్చి స్వర్గాన ఉంది.

యస్. ఆనందం (నిజామాబాద్)

"ఇంకేమైనా ప్రశ్న లున్నాయా ?" అన్నట్లు చూసింది కమల నలుగురికేసి—మనస్సులో కుత కుత ఉడికిపోతూ.

అప్పు డందుకొంది అబ్బాయి బామ్మగారు : "అయ్యో ! ఈ అమ్మాయి ఇంత పొడుగ్గా ఉందేమిటీ ? వరహీనం అవుతుందేమో కూడాను ! అబ్బాయి ప్రక్క నుంచోబెట్టికొలవకపోతే వీల్లే" దని భీష్మిస్తూ.

ఇక కమల కోపం ఆపుకోలేకపోయింది. వెంటనే చివాలున లేచి విసవిసా నడిచి లోపలికి వెళ్ళిపోయింది. అర్చికశాస్త్ర పట్టభద్రునితో సహా అమ్మలక్క లందరూ తెల్లబోయారు. "ఇంత పొగరుమోతుపిల్ల మాకు వద్దం" టూ తీర్పు చెప్పి అపూటే నిష్క్రమించారు పెళ్ళివారు.

ఆ రాత్రి కమలకు భోజనం సయించలేదు. మనస్సు దహించుకుపోతున్న ట్లయింది. 'పెళ్ళి' అనే దానికి పుస్తకాల్లోను, సినిమా కథల్లోను ఉండే ప్రతిపత్తి ఉంటే, యీ వెర్రి మొర్రి పెళ్ళిచూపులకు అర్థం ఏమిటో ఆమెకు అర్థం కాలేదు. తన అందం, తెలివి—ఇవన్నీ అంగట్లో వస్తువులవలె పరీక్షించే యీ పద్ధతిలోని ఔచిత్యం ఏమిటో ఆమెకు బోధపడలేదు. ఈ పెళ్ళి చూపులలో తనొక ఆటవస్తువు కంటె ఎక్కువేమీ కానన్నమాట !

కమల ఆత్మాభిమానం బాగా దెబ్బతింది. ఆమె కా రాత్రి నిద్ర లేదు. అంతవరకు వస్తే పెళ్ళి అనేదే లెక్కచేయగూడదని ఆమె అనుకోక పోలేదు !

## ౪

. . . . స్కూలుఫైనలు పరీక్ష పాసయినందుకు ఆనాడు వాసుదేవరావుగారింట్లో ఆనందోత్సాహాలు నిండి ఉన్నాయి. పెళ్ళి పెడాకులు లేకుండా యీ చదువేమిటని మనస్సులో విసుగ్గా ఉన్నా, పార్వతి కూడా కమలను అభినందించక తప్పలేదు.

కమల కాలేజీలో చేరతానని భీష్మించి, ఎలాగో తల్లి తోడ్పాటుతో తన పట్టు నెగ్గించుకొంది. ఆమె రెండో అన్న వెంకట్రావు కూడ కాకినాడ కాలేజీలో అప్పుడే ఫిజిక్సు లెక్చరరుగా చేరి, కాపురం పెట్టేడు. మూడో అన్న శ్యామలరావు బి. ఏ. సీనియర్‌లోకి వచ్చేడు. అందుచేత వాసుదేవరావుగారు కమల అభీష్టాన్ని సులువుగా ఆమోదించారు.

కాలేజీ వాతావరణంలో ప్రవేశించిన కొన్నాళ్ళకే కమల తన వయస్సులోను, అందంలోను కన్పించే క్రొత్త మార్పులు గుర్తించింది. 'పెళ్ళి', 'పెళ్ళిచూపులు' — వీటిపై తనలో జీర్ణించిపోయిన అభిప్రాయాలు విడువకపోయినా, కొన్ని వయో సహజమైన వూహాలు జనించినప్పుడల్లా ఆమె కొంచెం చలించేది. కాని వాటికి 'పెళ్ళి' తో గల సంబంధం ఆమె వూహకు అందలేదు.

*　　　*　　　*

కమల ఇంటర్మీడియేట్ పాస్ అయింది. స్వతహాగా తెలివైనది కాబట్టి ఫస్ట్ క్లాస్ లో వచ్చింది. కాలేజీలో బీ. ఎస్‌సి. క్లాసులో చేరింది.

గాంధీనగరంలో వెంకట్రావు కుటుంబం ఉండే ఇంటిప్రక్కనే కలెక్టరాఫీసు క్లర్కు కాంతయ్య కుటుంబం నివసిస్తుండేవారు. కాంతయ్య దంపతులకు సంతానానికేమీ లోటు లేదు. పెళ్ళి కెదిగిన బంగారపు బొమ్మలవంటి ముగ్గు రాడపిల్లలు, ఆ తర్వాత యిద్దరు మగపిల్లలు మాత్రమే ఆయనకు చెప్పుకోదగిన ఆస్తి. వచ్చే జీతపురాళ్ళు చాలక అద్దె యివ్వలేక యింటి యజమానిచేత చీవాట్లు తిన్న రోజులు, పస్తున్న రోజులు వారి జీవితంలో అనేకం. పిల్లల కేమైనా పెళ్ళి సంబంధలు తెలిస్తే చూడమని వెంకట్రావుని కాంతయ్య అర్థించటం అనేకసార్లు వింది కమల.

కాంతయ్య పెద్దకూతురు సుగుణ కమల యీడుదే అయినా, చిరిగిన బట్టలతో, చిక్కిన

ఇంటిల్లిపాదికి ఆనందం చేకూర్చే

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

తప్పక చదవండి !



"హయ్యో ! గబుక్కు నెవరైనా వస్తే ఇవ్వచ్చుని అట్టేపెట్టానండీ ఆ కిసాన్ స్క్వాష్ సీసా !"

ముందు జాగ్రత్త ఉన్న ఇల్లాళ్ళందరూ, గబుక్కున ఇంటికెవరైనా అతిథులువస్తే ఇవ్వడానికని ఎప్పుడూ అదనంగా ఒక "కిసాన్ స్క్వాష్" సీసా వేరే అట్టేపెట్టి ఉంచుతారు. చెట్టునముగ్గిన పళ్లనుంచి తీసిన ఈ రసంలో బలవర్థకాలైన విటమినులు పుష్కలంగా ఉంటాయి. ఏడాది పొడుగునా ఏకాలమైనా ఈ పళ్ళరసం ఇవ్వచ్చు. పుచ్చుకోనూవచ్చు. మరచిపోగలరు ! ఎప్పుడూ మీ యింట్లో రెండు మూడు సీసాలు అట్టేపెట్టి ఉంచుకోండి. ఆరెంజి, లెమన్ కాక మరి ఆరురకాల పళ్లరసాలున్నాయి.




కిసాన్ ప్రాడక్ట్స లిమిటెడ్, బెంగుళూరు

JWT-KP 1314

దేహంతో కొంచెం వన్నెతగ్గి కన్పించేది. ఆమె తరచు కమల యింటికి వస్తూ పోతూ ఉండేది. ఇద్దరూ చాలా స్నేహంగా ఉండేవారు. కని పెంచటం కష్టమైన కాంతయ్య ఆమెకు కమలతో సమంగా చదువెక్కడ చెప్పించగలడు ?

చాలా వూళ్ళు గాలించి, చెప్పులరిగేలాగ తిరిగి చివరకు సుగుణకు వో సంబంధం కుదిర్చి పెళ్ళయిందనిపించాడు కాంతయ్య. వరుడు సుగుణ కంటె పదేళ్ళ పెద్ద; మొదటి భార్య మరణించటం వలన 'కష్టంమీద', రెండో పెళ్లికి కనీసపు కట్నం రెండువేలు లభించటంవలన ఒప్పుకొన్నాడు. పెళ్లిలో బంగారు శలాకవలె మెరిసిపోతున్న సుగుణ, ప్రక్కన వరుణ్ని చూచిన అమ్మలక్క లందరూ సుగుణకు మనస్సులో ఎంతో సానుభూతి అందించారు.

సుగుణ పెళ్లి అంతా కమల గమనిస్తూనే ఉన్నది. మొదట పెళ్లిచూపులు, తర్వాత తలకు మించే కట్నాలు—ఇవి లేకపోతే పెళ్లే లేదు. ఈ "వివాహం" అనే వ్యవస్థకు ఇదేనా పరమావధి ? అని ఆమెకు అనిపించేది. కాని తనకు పుస్తకాలలో గాని, సినిమాలలో గాని 'పెళ్లి' అంటే ఉండే నిర్వచనానికీ, లోకంలో ఉండే అర్థానికీ పోలిక కన్పించలేదు. "ఇటువంటి పెళ్లి అయితేనేమి, కాకపోతే నేమి ?" అని ఆమె కాలేజీ డిబేట్లలో ఉపన్యాసాలు యిచ్చేది. కాని 'వయస్సులో జనించే కోర్కెలకు పెళ్లికి ఏమైనా సంబంధం ఉన్నదా ?' అనే ప్రశ్న ఆమె వూహాపరిధిని దాటింది. తా నటువంటి కోర్కెల కతీతురాలనని ఒక్కొక్కప్పుడు విర్రవీగినా, మరొకప్పుడు తన విశ్వాసంపై కొంచెం నమ్మకం సడిలేది.

## 5

కమల కాలేజీ డిబేట్లలో యిచ్చే ఉపన్యాసాలను ఎక్కువగా మెచ్చుకొనే వారిలో సూర్యారావు ఒకడు. తరచుగా ఆమెకు ప్రత్యర్థిగా నిలచి వాదించినా, ఆమె వాదనలను, కూడ మెచ్చుకొనేవాడు. వారి పరిచయానికి కాలేజి డిబేట్సు రంగస్థలాలు అయ్యేవి.

సూర్యారావు, కమల ఒకే క్లాసు. కమలకు మల్లేనే సూర్యారావుకి కూడా జీవితంమీద, సాంఘిక వ్యవస్థలమీద ఉండే అభిప్రాయాలు ఇదమిత్థమని చెప్పటం కష్టం. అయినా అందం, అణకువ, శ్రద్ధ, తగిన సంస్కారమూ లేకపోలేదు. పైపెచ్చు అతను ఆ కాలేజీలోని ప్రముఖ టెన్నిస ఆటగాళ్లలో ఒకడు. మంచి వక్త అని పేరు పొందాడు తరచుగా కమల, సూర్యారావూ తమ కాలేజి తరఫున అంతర్విశ్వ విద్యాలయ వక్తృత్వపు పోటీలలో పాల్గొనేవారు. అది వారి పరస్పర భావాలను వ్యక్తం చేసుకొనటానికి అవకాశం కల్పించి, పరిచయాన్ని పెంపొందింపజేసింది.

* * *

కమలతో సూర్యారావు పరిచయం 'ప్రేమ' లోనికి దారి తీస్తుందని వా రిద్దరూ కూడ మొదట వూహించనేలేదు.

కమల దృష్టిలో మొదటినుండీ 'పెండ్లి'అనే

వ్యవస్థపై గౌరవం తక్కువ. వయస్సులో పరిణత పొందుతున్నా, ఆమె 'అనుభవాలు' ఆమెను పెండ్లికి అంగీకరింపచేయలేక పోయాయి. అనేకసార్లు ఆమె పెళ్లి గురించి తండ్రికి సుదీర్ఘమైన లేఖలు వ్రాస్తూ సంఘంలో ప్రస్తుతం 'పెళ్లి' అనే వ్యవస్థ యెడ తనకు గల తిరస్కారాన్ని వ్యక్తం చేసింది. కాని ...... సూర్యారావు పరిచయంతో తనలో కలిగిన భావాలు తన జీవితంలో ఒక నూత్న ప్రకరణం తెరచినట్లు భావించింది కమల. అతని సాన్నిధ్యంలో ఆమెకు ఒడలు పులకరించేది. తరచు అతని దర్శనభాగ్యానికై తపస్సు చేసేది. తత్ఫలితంగా వారు తరచు కలుసుకొంటూ, వీలయి నప్పుడల్లా పార్కులలోను, సినిమాలలోను విహరించేవారు.

'ప్రేమ' అనే మాటకు కమల ప్రస్తుత నిర్వచనం 'సూర్యారావు !'. ఆ ప్రేమకి పర్యవసానం ఏమిటో ఆమెను ఆమె వయస్సు, యవ్వనపు పొంగు ఆలోచించనీయలేదు. ఆమె వూహించ గలిగినంతలో దాని పర్యవసానం సూర్యారావు పరిచయంతో తనకు లభించిన తీయని అనుభవాలే. ఆ అనుభవాలు శాశ్వతం అయితే బాగుండునని ఆమె కోరుకొనేది.

## 6

యూనివర్శిటీ పరీక్షలు వ్రాసి, సెలవులకు తమ సొంత వూరు వెళ్లింది కమల. రిజల్ట్సు వచ్చిననాడు కమల పరీక్షలో తప్పటం కమలకు తప్ప మిగతా అందరికీ ఆశ్చర్యం కలిగించింది. దానిని గురించి ఆమె కొంత విచారించినా, సూర్యారావు నుండి వేరుకావటం, అతని వర్తమానం ఏమీ తెలియకపోవటం ఆమెకు పెద్ద మనో వ్యధగా ఉండేది.

ఉన్నట్లుండి ఒకరోజున సూర్యారావు వద్ద నుండి అతని పెళ్లికి ఆహ్వానిస్తూ వచ్చిన శుభలేఖ ఆమెను దిగ్భ్రాంతురాల్ని చేసింది. ఆమెకు తన ఆశలు కుప్పకూలినట్లయింది. ఆమె జీవితంలో ఎంతో ప్రేమగా పెంచుకొన్న ఆశయాలు ఎండమావులుగా పరిణమించటం ఆమెలో ఎనలేని నిరాశ రేకెత్తించింది. నిస్పృహాయురాలైన ఆమె వేడి నిట్టూర్పులు నిర్వేదాన్ని స్ఫురింపజేశాయి.

* * *

కాలచక్రం దొర్లిపోయింది. కమల జీవితంలో రూపంలో, భావనలో ముప్పయి అయిదేళ్లు నిండాయి. ఆమె కిప్పుడింకేమీ జీవితంపై చెప్పుకో దగిన ఆశయాలు వూహలు లేవు. యాంత్రికంగా రోజులు మాత్రం గడుస్తున్నాయి. మోడు వారిన ఆమె తలపులకు వసంతశోభ లేమీ కన్పించ లేదు.

తలిదండ్రుల, పెద్దల కోరికపై, ప్రయత్నంపై కమల తుదకు పెళ్లికూతు రయింది.

* * *

ఒడిలో నిద్రపోతున్న పసికందు ఏడవటంతో వూహాలోకాన్నుండి ప్రస్తుతానికి వచ్చింది కమల. అప్పుడే డాబామీదకు వచ్చి విశ్రాంతి తీసుకొంటున్న భర్త రాకను గమనించనందుకు తన మతిమరుపుకు నవ్వుకొంది తనలో తాను. 'కేరు' మన్న పసిపాప కాసేపటిలో మళ్లీ ఒడలు మరచి, చిరునవ్వులు చిందుతూ సుషుప్తిలో లీనమయ్యాడు. ★



### పూవు మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, మీ సరియైన దర్శనముగురించిన్నీ మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామా యున్ను వెంటనే వ్రాసి పంపండి.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములలో మీకు జయముకలుగునో, మీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రమే వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల సైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

